# సెంటిమెంట్

సీరియల్ నవల మాదిరి వర్షం కురుస్తోంది. అక్కడ ఆర్టీసీ బస్టాండ్‌లో, ఆ చితచితలో, జిల్లుమనే చలిగాల్లో ఆగకుండా.......... ఆగుతుందేమో అనిపించి మళ్లీ మలుపులు తిరిగి సాగే సీరియల్ మాదిరి కురిసే వర్షాన్ని తిట్టుకుంటున్నారు. "పాడువాన! ఎన్నాళ్ళయినా ఇట్టా కురుస్తూనే వుంటుందేమో" అనుకుంటున్నారు. పొడవాటి ఆ రేకుల గదిలో ప్రయాణీకులు గజిబిజిగా వున్నారు. కొంతమంది ముసుగుతన్ని ఈ రోత ప్రపంచాన్ని చూడకూడదన్నట్టు పడుకున్నారు. మరి కొందరేమో మూటలూ పెట్టెలూ పరిచేసి, కనపడినవల్లా కొనేసి నమిలి చుట్టూ తొడిమెలూ తొక్కలూ పోసేసి, పక్కన ఎవ్వరూ కూర్చోడానికి వీల్లేకుండా చేసి తృప్తిగా వున్నారు. కొంత మంది కాళ్లూ చేతులూ సాచుకోడానికి వీల్లేకపోయినా, యీ కాసేపు ఎట్లాగో సర్దుకుపోదామన్నట్టు వొదిగి కూచున్నారు. మొత్తంమీద ఆ షెడ్డు బయట కురిసే చినుకులు తప్ప మనుషు లెవరూ లేకుండావుంటే, షెడ్డులో మాత్రం చినుకు కూడా నేలరాలడానికి వీల్లేనంతగా మనుషులు కిక్కిరిసి వున్నారు.

అట్లాంటి జనం మధ్యన.......... వువ్వెత్తున లేచిన అలనలుమూలలా తాకినట్టు ఆఖర్న వానకు సగంతడుస్తూ నిల్చున్న వాళ్ళలో కూడా సంచలనం కలిగేట్టు ఏదో కలకలం చెలరేగింది. ఆ లోపల ఏదో జరిగినట్టు వత్తిడితప్ప ఏం జరిగిందో తెలీదు. "ఏమయింది? ఏమయింది?" అని ఒకర్నొకరు ప్రశ్నించుకుంటున్నారు. మోచేతుల్తో పక్కవాళ్ళను నెట్టి సందులగుండా చూసినారు. బొటన వేళ్ళ మీద నిక్కిచూసినారు. ఆలోపలంతా గగ్గోలు, అలజడి! గొర్రెల మంద మధ్య తోడేలు చొరబడితే అట్లా భయపడతాయేమో! అయితే, గొర్రెల మందకు భయం తప్ప మరేమీ వుండదు. అక్కడి మనుషుల ముఖాల్లో భయంతో పాటు అసహ్యం కనిపిస్తోంది.

ఇందరి భయానికీ, అసహ్యానికీ కారణమైన ఆ మనిషి కూచొని చుట్టూ చూశాడు. "ఫో...... ఫో! ఇక్కన్నుంచీ దూరంగా ఫో" అంటున్నాయి చుట్టూ వున్న చూపులన్నీ,

అంతవరకూ ఆ మనిషికి దగ్గరకూచొనివున్న ఆమె, కూచునేజరుగుతూ దూరంగా వెళ్లింది. తను దూరంగా వెళ్లడమేకాక, తన సామాన్లని కూడా ఆమనిషి దగ్గరగా లేకుండా దూరంగా లాక్కుంది. ఆమనిషి ఆలోచిస్తున్నాడు. తను ఇంతమంది మధ్యన ఎట్లా వుండినట్టు? నిన్న సాయంత్రం అడుక్కునే ఓపిక లేకపోవడంతో గుంపునుంచీ విడిపోయి ఇక్కడి కొచ్చిపడుకున్నాడు. అప్పుడిక్కడ, ఇక్కడొకమనిషి, అక్కడొక మనిషీ కూర్చొనివుండినారు. ఇంత మంది ఎట్లొచ్చినారు! వర్షం పడుతోంది.............. అందుకని వచ్చినారుకావాల. అంటే, నిన్న సాయంత్రం నుంచీ తను పడుకునే వుండిపోయినాడన్నమాట! జ్వరంవచ్చిందేమో! అయినా, ఆకలిగానూ వుంది. ఏదైనా తిందామంటే పైసల్లేవు. వీళ్ళ దగ్గర అడుక్కోవచ్చుగా. అందరిదిక్కూ చూసినాడు. ఆ చూపులు తనకలవాటే. బజార్లో వెళ్తున్నప్పుడు.......... ఏదో మాట్లాడుకుంటూ వెళ్తుంటారు. తను మొండి వేళ్ళతో పట్టుకున్న డబ్బాను ముందుకు చాపే సరికి, ఉలిక్కిపడి దూరంగా వెళ్తారు. చేతులు చేతులు పట్టుకునీ, భుజాలమీద చేతులు వేసుకునీ వస్తున్నవాళ్లు తనని చూసేసరికి, కట్టు తెంచుకుని భయంతో దూరంగా వెళ్లిపోతారు. కొందరు, తను ఎదురుగ్గా నిల్చొనివుండటం చూసి, అంతదూరాన్నుంచే ఇంకోపక్కకు వెళ్ళిపోతారు. పైసలు వేసిన వాళ్ళు కూడా, తన డబ్బాను తాకితే ఆ వ్యాధివస్తుందేమోని భయపడుతున్నట్టు, ఎత్తునుంచీ డబ్బాలో పడేస్తారు. ఇవన్నీ తనకలవాటేకానీ, ఇప్పుడీ చూపులు ఇంకేదో రకంగా వున్నాయి. "మామూలు మనిషి మాదిరే పడుకుని వుండి మమ్మల్ని మోసం చేసినావు" అని ఆరోపిస్తున్నట్టు వున్నాయి. అతను ఇంత స్పష్టంగా ఆ చూపుల అర్థాన్ని తెలుసుకోక పోయివుండొచ్చుకానీ, ఆచూపుల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ఆరోపణని సూచనగా గ్రహించినట్టున్నాడు. అందుకే వాళ్లను అడుక్కోలేక పోయాడు. గోడదగ్గర పడివున్న డొక్కుడబ్బాను మొండి వేళ్లతో జరుపుకుని అందుకున్నాడు. లేచి, ముందుకు నడచినాడు. అంతా సర్దుకుని దారిచ్చి, అతను వెళ్లి పోయినాక 'అమ్మయ్య' అనుకున్నారు. చెల్లా చెదరైన ముక్కలన్నీ మళ్ళీ అతుక్కున్నట్టు, మొదటి దృశ్యం ఏర్పడింది.

★ ★ ★

ఉన్నట్టుండి ఒక్కసారిగా హార్మోనియంతో కలిసి పాడుతున్న ఆడ కంఠం వినిపించింది. జనం మధ్యకి ఎట్నుంచి దూరి వచ్చినారో తెలీదు. పొట్టేలి కొమ్ములమాదిరి వడితిరిగిన దుబ్బుజుట్టుతో వున్న ఓ కుర్రవాడు హార్మోనియంని మెడకు తగిలించుకున్నాడు. ఒక చేత కొలిమి తిత్తి మాదిరి దాన్ని ఊదుతూ, ఇంకోచేత దాని పీకలన్నీ పీకి పారేస్తున్నంత జోరుగా హార్మోనియం వాయిస్తున్నాడు. దూడ వయసులోనే కాడి మోసిన గిత్తమాదిరి

గిడసబారి వున్నాడు ఆ కుర్రాడు. ఎర్రరవికతో, చెంగుతలమీద కప్పుకున్న నల్లని చీరెతో బచ్చున బొమ్మమాదిరున్న ఆ అమ్మాయి కెవ్వుమని అరుస్తోంది. ఆ అమ్మాయి కంఠం హార్మోనియంతో ఎక్కడా కలవడమేలేదు. ఆ రెండూ కలవాలని వాళ్లను కున్నట్టూ లేదు. ఎవరిపని వాళ్లు చేస్తున్నట్టు కనిపించారు. ఆపాట ఏదో సినిమాలో సెల్లెలిపాట. పాట అయ్యాక, ఆ వాయిద్యగాడటూ, ఆ అమ్మాయి ఇటూ 'అమ్మా! అయ్యా' అంటూ చెయ్యి చాపుతున్నారు.

"ఆ అమ్మాయేంగావాలనీకు?" అడిగినాడొక పెద్దమనిషి.

"సెల్లెలండీ" జనంలో కుతూహలం పెరిగిపోయింది. అన్నాచెల్లెలి సినిమాలన్నీ జ్ఞాపకానికొచ్చినై. కొందరికి అన్న ఎన్టీరామారావుగా కనిపిస్తే, మరికొందరికి నాగేశ్వరరావుగా కనిపించినాడు. "పెళ్లిసెయ్యలేదా?" అనడిగాడొకాయన. "అందుకే నండీ యీ తిప్పలు. పాన మిడుస్తూ, సెల్లెలికి పెండ్లిసేసేదాకా నువ్వు సేసుకోవద్దన్జెప్పి సేతిలో సెయ్యేయిచ్చు కుందండీ మాయమ్మ. నాకేమో మాయత్త కూతురుంది. మాయత్తంటదీ........ 'నీ సెల్లెల్ని యిడిసి రా, నాకూతుర్నిస్తా, ఇల్లటముండు' అంటాది. తల్లి కిచ్చిన మాటతప్పి, సెల్లెల్నొదిలి నేను పెండ్లి సేసుకుంటే పురుగులు పడిపోనండీ"

"కొడుకంటే అట్టుండాల" అనుకున్నారు తల్లులు. "అన్నంటే అట్టుండాల" అనుకున్నారు సెల్లెళ్లు. "అన్నా సెల్లలంటే అట్టుండాల" అనుకున్నారందరూ.

"ఇదిగో! అబ్బి, ఇట్టారా" "ఇదిగో అమ్మి, ఇట్టారా" అని పిల్చి పిల్చి....... చెల్లెలి పెళ్ళికి తలో చెయ్యి వేశారు.

★ ★ ★

వర్షం ఇంకా కురుస్తూనేవుంది. బస్టాండ్‌లో ఓమూలగా వున్న చిన్న హోటల్లో రేడియో హోరెత్తి పాడుతోంది. ఓ మూలగా వున్న బెంచీమీద. 'అన్నా చెల్లెలు' కూర్చొని వేడివేడి ఇడ్లీలు సాంబారులోకలుపుకుని తింటున్నారు.

"అన్నా సెల్లెలమని సెబుతుంటే అదోకరకంగా వుంటాదబ్బా నాకు" అంది ఆ అమ్మాయి. "నీ మొకం......." అన్నాడతను. తేలిగ్గా మళ్ళీ అన్నాడు. "ఆలూ మొగుండ్లమని అడుక్కో, ఎట్టుంటాదోసూడు. అన్నా సెల్లెలు సినిమాలు ఎన్నితీసినా డబ్బు లొస్తాండేదెందుకు? జనం ఎర్రోళ్ళు కాబట్టి, తీసే వాళ్ళెర్రోళ్ళు కాదు" అని నవ్వినాడు.

"ఎవరికన్నా తెల్సిందనుకో. మనకుమల్లడబ్బు లేస్తారా?"

"ఎట్ట తెలుస్తాది? సినిమాలో అన్నా సెల్లెలికంటే ఎక్కువ మనమేంజేస్తాండాం? వాళ్లను అన్నా సెల్లెలేనని ఒప్పుకోని డబ్బులిచ్చే వాళ్ళు మనల్నెందు కొప్పుకోరు? వూరికే బయపడొద్దు. తినవే సెల్లెలా తిను"

*(1975 సెప్టెంబర్‌లో 'ఆంధ్ర జ్యోతి' వారపత్రికలో ప్రచురితం)*

# -- కథ గురించి. . .

1970 దశాబ్దంలో, అన్నా చెల్లెలి సెంటిమెంట్‌తో తెలుగు సినిమాలు చాలా వచ్చాయి. అందులో అన్నా చెల్లెలి సంబంధం అసహజంగా, విడ్డూరంగా వుండేది. వాస్తవజీవితంలో అట్లా వుండదని, ఆ సినిమాలు తీసిన వాళ్ళకూ, చూసిన వాళ్లకూ తెలుసు. అయినా, ఆ సినిమాలకు లాభాల గ్యారెంటీ వుండేది.

సానుభూతి వుండవలసిన చోట వుండకపోవడమూ, అవసరం లేనిచోట అతిగా వుండటమూ అనేది సామాజిక విలువల్లోని విపరీతాలు. దిగంబర కవులు ఇటువంటి వ్యవస్థని 'కుష్టువ్యవస్థ' అన్నారు. ('కుష్టు' అంటే వాళ్ళకూ అసహ్యమేనా?) ఈ విపరీతాన్ని సూచిస్తూ, ఆ సినిమాల్లోని 'అన్నాచెల్లెలి' సెంటిమెంటును అపహాస్యం చేస్తూ రాసిన కథ. "ఆ సినిమాల్లో అన్నా సెల్లెలికంటే ఎక్కువేంజేస్తాండాం?" అనడం, ఆధోరణిపై తీవ్రమైన అసహ్యాన్ని వ్యక్తం చేయడం.